క్లుప్తంగా

టీటీడీకి అంబులెన్స్ వితరణ



తిరుమల: స్టేట్ బ్యాంక్ రూ.25 లక్షల విలువైన అంబులెన్స్‌ను శనివారం టీటీడీకి వితరణ చేసింది. బ్యాంక్ చైర్మన్ దినేష్‌కుమార్ ఖార అంబులెన్స్‌కు ప్రత్యేక పూజలు చేసి తాళాలను ఈవో ధర్మారెడ్డికి అందజేశారు.

చెడు అలవాట్లకు లోనుకావద్దు



మాట్లాడుతున్న డీఎస్పీ ఎ.రామచంద్ర

తిరుపతి ఎడ్యుకేషన్: విద్యార్థులు చెడు అలవాట్లకు లోనుకాకుండా ప్రణాళికతో మంచి భవిష్యత్‌కు దిశా నిర్దేశం చేసుకోవాలని రేణిగుంట డీఎస్పీ ఎ.రామచంద్ర తెలిపారు. కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే చదువుతో పాటు నైపుణ్యాలు అవసరమని తెలిపారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కోర్సులో చేరే విద్యార్థులు భవిష్యత్తుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. డైరెక్టర్లు మన్నెం రామసుబ్బారెడ్డి, మన్నెం అరవింద్‌కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ కె.జయచంద్ర పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

తిరుచానూరు: రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆదేశాల మేరకు నేషనల్ యూత్ డే సెలబ్రేషన్స్ సందర్భంగా శనివారం సెట్విన్ ఆధ్వర్యంలో తిరుచానూరు జెడ్పీ హైస్కూల్‌లో కబడ్డీ, కోకో, వాలీబాల్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. దామినేడు, పద్మావతిపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 12న సెట్విన్ కార్యాలయంలో బహుమతులు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు సెట్విన్ సీఈవో మురళీకృష్ణ తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

- ఒకే కుటుంబానికి రూ.16.60 లక్షల లబ్ధి
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- 8వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: తల్లీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా.. ఇన్ని పథకాలు గతంలో ఎప్పుడైనా వచ్చాయా.. అని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్థానికులను ప్రశ్నించారు. అర్హతే ప్రామాణికంగా జగనన్న ప్రభుత్వం పథకాలు అందజేస్తోందని పేర్కొన్నారు. ఆయన శనివారం డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, కార్పొరేటర్ మునిరామిరెడ్డి, ఆ డివిజన్ అధ్యక్షుడు మురళితో కలిసి 8వ డివిజన్‌లోని ఎర్రమిట్ట, మద్దిమానువీధి ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి వారు పొందిన పథకాలు, లబ్ధిని వివరించారు. ఎర్రమిట్టలో ఉంటున్న ఆర్.మాధవీలత కుటుంబానికి వివిధ పథకాల ద్వారా రూ.16.60 లక్షల లబ్ధి పొందినట్లు పేర్కొన్నారు. గతంలో ఇంత లబ్ధి పొందారా అని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఏ గడపకు వెళ్లినా రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల వరకు లబ్ధి పొందిన వారు ఉన్నారని స్పష్టం చేశారు. పార్టీ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, కో–ఆప్షన్ సభ్యులు శ్రీదేవి, తాతయ్యగుంట గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, రవిచంద్ర, గఫూర్, మురళి, నాదముని, కంకనాల రమేష్, రామూర్తి తదితరులు పాల్గొన్నారు.

టేప్ ఎగ్జిబిషన్ ప్రారంభం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ద అసోసియేషన్ ఆఫ్ ప్లానర్స్ అండ్ ఇంజినీర్స్ (టేప్) ఆధ్వర్యంలో ఎయిర్ బైపాస్ రోడ్డులోని పీఎల్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్, మ్యానుఫ్యాక్చర్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ప్రారంభించారు. అసోసియేషన్ చైర్మన్ వెంకటేష్‌బాబు, అధ్యక్షుడు ఎం.ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తమకు నచ్చిన విధంగా అధునాతన పద్ధతుల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలనుకునే వారు ఎగ్జిబిషన్‌ను సందర్శించి తమ కలలను సాకారం చేసుకోవాలని కోరారు. ఆదివారం కూడా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుందని తెలిపారు. మేయర్ శిరీష, డెప్యూటీ మేయర్ ముద్రనారాయణ, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.షణ్ముగం, బి.సురేష్, సుధాకర్‌రెడ్డి, నాగేశ్వరరావు, శివశంకర్ రెడ్డి, రఘునాథరెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమలపై విష ప్రచారం తగదు



పోకల అశోక్‌కుమార్

తిరుపతి అలిపిరి: కొందరు పనిగట్టుకొని తిరుమల క్షేత్రంపై తప్పుడు ప్రచారాలు చేస్తూ టీటీడీ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ వాపోయారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. తిరుమలలో పాడైన అద్దె గదులను రూ.119 కోట్లతో ఆధునికీకరణ పనులు చేపట్టినట్టు తెలిపారు. ఎస్టేట్ కమిటీ సభ్యుడిగా తాను కూడా పనులను పర్యవేక్షించినట్టు తెలిపారు. చక్కటి వసతులు సమకూర్చిన నేపథ్యంలో గదుల అద్దె మార్చాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతానికి సాధారణ భక్తులకు ఇచ్చే రూ.50, రూ.100 అద్దె అలాగే ఉన్నట్టు తెలిపారు. తిరుమల క్షేత్రంలో చిన్న విషయాన్ని కూడా భూతద్దంలో చూస్తూ విష ప్రచారం చేస్తున్న పత్రికలు, విమర్శకులు వాస్తవాలను గ్రహించాలని తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

తిరుపతి తుడా: తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి శనివారం 39వ వార్డులోని వివేకానంద కూడలి, జర్నలిస్ట్ కాలనీ, చెన్నారెడ్డి కాలనీ, అంబేడ్కర్ కాలనీ, మారుతి నగర్‌లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. చెన్నారెడ్డి కాలనీలోని కొనేరును శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. కోనేరు చుట్టూ పూల మొక్కలు నాటాలని సూచించారు. పక్కనే ఉన్న శ్మశానవాటికలో చెత్తాచెదారాన్ని తొలగించాలని చేపట్టాలని ఆదేశించారు. హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య పాల్గొన్నారు.

దత్తతకు నెమలి

తిరుపతి అలిపిరి: ఎస్వీ జూపార్క్‌లోని నెమలిని తిరుపతికి చెందిన హరినాథరెడ్డి కుటుంబ సభ్యులు తిరుపతి దత్తత తీసుకున్నారు. నెమలికి ఏడాదికి సరిపడా ఆహారం అందించడానికి రూ.21,900 జూ క్యూరేటర్ సెల్వంకు అందజేశారు. ఏటా ఆనవాయితీగా హరినాథరెడ్డి సతీమణి చరిష్మ పేరిట సాయం ఇస్తున్నట్లు దాతలు చెప్పారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

తిరుపతి మంగళం: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యం కలుగుతుందని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ తెలిపారు. ఆయన శనివారం 14వ డివిజన్‌లో పర్యటించారు. ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని, మురుగు కాలువలను శుభ్రం చేయాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు.

వంద కిలోమీటర్లు వెళ్లి పింఛను పంపిణీ



చంద్రమ్మకు పింఛను అందజేస్తున్న సర్పంచ్ చిన్నియాదవ్

తిరుపతి రూరల్: కొత్తగా మంజూరైన పింఛనును వెంకటపతినగర్ సర్పంచ్ చిన్నియాదవ్ 100 కిలోమీటర్ల దూరం వెళ్లి లబ్ధిదారునికి అందజేశారు. పంచాయతీకి చెందిన చంద్రమ్మకు జనవరిలో వృద్ధాప్య పింఛను మంజూరైంది. ఆమె అనారోగ్యంతో బాధపడుతూ పీలేరు సమీపంలో కుమారుడు పనిచేస్తున్న ఇటుక బట్టీల వద్ద ఉన్నట్టు సర్పంచ్ చిన్నియాదవ్ తెలుసుకున్నారు. ఆయన వలంటీర్, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్‌తో కలిసి చంద్రమ్మ వద్దకు వెళ్లి రూ.2750 పింఛను అందజేశారు. సర్పంచ్ చిన్నియాదవ్‌ను చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ మోహిత్‌రెడ్డి అభినందించారు.

నెరవేరిన 50 ఏళ్ల కల

పాకాల: మండలంలోని ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ అగ్రహారం నుంచి దామలచెరువు–నేంద్రగుంట రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. సర్పంచ్ గౌరీశంకర్‌రాజు శనివారం విలేకరులతో మాట్లాడుతూ 50 ఏళ్లుగా అగ్రహారం గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక స్థానికులు ఇబ్బందులకు పడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సహకారంతో తుడా నిధులు సుమారు రూ.22 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టినట్టు తెలిపారు.

ఫొటోగ్రాఫర్లకు ఎస్‌బీఐ రుణాలు

తిరుపతి కల్చరల్: అర్హత కలిగిన ఫొటోగ్రాఫర్లకు రుణాలు మంజూరు చేస్తామని ఎస్‌బీఐ కపిలతీర్థం బ్రాంచ్ మేనేజర్ హరిప్రసాద్ తెలిపారు. యూత్ హాస్టల్లో శనివారం తిరుపతి ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లకు రుణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ హరిప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ పవన్‌కుమార్, మేనేజర్లు చైతన్య, శివకుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని రుణాల మంజూరుపై అవగాహన కల్పించారు.


జాతీయ పోటీలకు ఎస్‌కేఆర్ఎస్ విద్యార్థిని

తిరుపతి ఎడ్యుకేషన్: ఈ నెల 10 నుంచి 13 వరకు ఎర్నాకులంలో జరిగే జాతీయ స్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి హైస్కూల్ విద్యార్థిని రమ్యశ్రీ ఎంపికైంది. ఆమెను టీటీడీ డీఈఓ ఎం.భాస్కర్‌రెడ్డి శనివారం అభినందించారు. హెచ్ఎం సురేంద్రబాబు, కోచ్ గోపీనాయుడు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రెక్టార్ పదవి ఇవ్వాలి

తిరుచానూరు: ఎస్వీయూ రెక్టార్ పదవిని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ సీనియర్ ఆచార్యులకు ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ రీసెర్చ్ స్కాలర్స్ అండ్ పీజీ స్టూడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.మురళీకృష్ణ కోరారు. ఆయన శనివారం వీసీ కె.రాజారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయాన్ని దృష్టిలో ఉంచుకొని బహుజనులకు ఉన్నత పదవులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. యూనివర్సిటీలో కీలకమైన రెక్టార్ పదవిని అర్హులైన వారికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ వితరణ



తిరుచానూరు: ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలో ఎంఏ ప్రవేశ పరీక్షలో దామినేడుకు చెందిన ఉమేష్‌చంద్రనాయక్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మూడో స్థానం సాధించారు. ఆయనకు తిరుచానూరు సర్పంచ్ కె.రామచంద్రారెడ్డి శనివారం సుమారు రూ.50 వేల విలువైన ల్యాప్‌టాప్ వితరణ చేశారు.

జల్లికట్టు నిర్వహిస్తే చర్యలు

రామచంద్రాపురం: జల్లికట్టు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చంద్రగిరి సీఐ ఓబులేశు హెచ్చరించారు. ఆయన శనివారం ఎస్ఐ గిరిబాబుతో కలిసి నూతిగుంటపల్లిలో జల్లికట్టు నిర్వాహకులతో మాట్లాడారు.

ఎమ్మార్పీకే వస్తువుల విక్రయం

తిరుపతి అర్బన్: జిల్లాలోని ఆర్టీసీ బస్టాండ్లలో ఉన్న దుకాణాల్లో ఎమ్మార్పీకే వస్తువులను విక్రయించాలని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీవో) చెంగల్‌రెడ్డి ఆదేశించారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతుల ఐక్యతకు ప్రతీక పేరూరు చెరువు



స్వర్ణముఖి నది వద్ద గంగమ్మకు పూజలు చేస్తున్న ఎంపీపీ మోహిత్‌రెడ్డి, నాయకులు, రైతులు

తిరుపతి రూరల్: రైతుల ఐక్యత, సమష్టి కృషితోనే పేరూరు చెరువుకు జలకళ వచ్చిందని తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి కొనియాడారు. స్వర్ణముఖి నది నుంచి పేరూరు చెరువుకు నీరు వస్తున్న నేపథ్యంలో శనివారం ముక్కోటి వద్ద గంగమ్మకు రైతులు, అధికారులతో కలిసి పూజలు చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ చెరువు కాలువ కోసం ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రత్యేక నిధులు మంజూరు చేశారని వివరించారు. పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, ఎంపీటీసీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, ఉపసర్పంచ్ పరంధామరెడ్డి మాట్లాడుతూ పేరూరు చెరువులో ఆక్రమణలను తొలగించి రాయలచెరువు తరహాలో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఎంపీపీ మోహిత్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎంపీపీ ప్రభుత్వం, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి చెరువును అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

చాణక్యనాయుడు మృతికి సంతాపం

పాకాల: దామలచెరువు పంచాయతీ కట్టకిందపల్లికి చెందిన చాణక్యనాయుడు మృతికి తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సంతాపం తెలిపారు. ఆయన శనివారం ఉదయం కట్టకిందపల్లిలోని చాణక్యనాయుడు స్వగృహానికి చేరుకుని భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నాటా సేవలు ప్రశంసనీయం

తిరుపతి రూరల్: ఉత్తర అమెరికా తెలుగు అసోసియేషన్ (నాటా) సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. తిరుచానూరు పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థిని దేవిశ్రీకి నాటా పంపిన ఉపకార వేతనం చెక్కును ఆయన శనివారం అందజేశారు. ఎంపీడీవో వెంకటనారాయణ, ఏవో పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్యూచర్ ఆన్ ప్రీ, గ్లోబల్ ఐకాన్స్ స్కూల్ వార్షికోత్సవం



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ఫ్యూచర్ ఆన్ ప్రీ స్కూల్, గ్లోబల్ ఐకాన్స్ స్కూల్స్ 4వ వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి మహతి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షురాలు గంగవరం శ్రీదేవి ముఖ్య అతిథిగా పాల్గొని వేడుకలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. అనంతరం యూకేజీ పూర్తి చేసిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్స్ అందజేశారు. విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ దిలీప్‌కుమార్, అసోసియేట్ డైరెక్టర్లు రాకేష్, శశిరేఖ పాల్గొన్నారు.

శరవేగంగా సాగర్ పనులు



పనులను పరిశీలిస్తున్న మేయర్, కమిషనర్

తిరుపతి తుడా: వినాయకసాగర్‌లో మొదటి దశ పనులను పూర్తిచేసి ఫిబ్రవరిలో ప్రారంభించనున్నట్టు మేయర్ శిరీష తెలిపారు. ఆమె శనివారం కమిషనర్ అనుపమ అంజలితో కలిసి వినాయకసాగర్ అభివృద్ధి పనులను పరిశీలించారు. వారు మాట్లాడుతూ హుస్సేన్ సాగర్ తరహాలో వినాయక సాగర్ ఆహ్లాదాన్ని పంచనుందన్నారు. సకాలంలో పనులు పూర్తి చేయాలని, లేని పక్షంలో చర్యలు వుంటాయని సిబ్బందిని హెచ్చరించారు. వారి వెంట ఎస్ఈ మోహన్, కాంట్రాక్టర్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.